# ఆకాశం చుట్టుకొలత

నేను చచ్చిపోయాను!

కాని నా చెవులు పని చేస్తున్నాయి, పెద్ద శబ్దం, భరింతలేనంత శబ్దం. అగ్ని పర్వతాలు నా చెవిలోనే పగిలిపోతున్న శబ్దం.

ఈ శబ్దానికి నా కర్ణభేరి పగిలిపోతుందేమో నన్నంత శబ్దం. కర్ణభేరి అంటే గుర్తుకొచ్చింది. స్కూల్లో ఏడవ క్లాసు సైన్స్ పుస్తకంలో చదివినట్లు గుర్తు. చెవిలోపల కర్ణభేరి ఉంటుంది. అది చిల్లులుపడితే వినికిడి శక్తిపోతుందని...

అబ్బ... శబ్దం... మోత... భీకరమైన శబ్దం.

ఐడియా వచ్చింది. ప్రొద్దున్న ఇంటర్వ్యూకి బయలుదేరేటప్పుడు చొక్కాకి గుండీ ఊడిపోతే గుండుసూదితో సర్దేశాను. ఆ గుండుసూదినే చొక్కానుండి తీశాను. కళ్లు గట్టిగా మూసుకున్నా, నాకు తెలియకుండానే నా నోరు తెరుచుకుంది. సూది చెవిలోకి గట్టిగా నా బలమంతా ఉపయోగించి పొడిచాను. ఆ... అబ్బా...

రక్తం... రక్తం...

''భార్య నుదుటి సిందూరతిలకం స్వేదంతో తడిసి బొట్టుబొట్టుగా నేల రాలుతున్నట్టు, ఎర్రటి రక్తం నా చెవినుండి కారుతోంది.''

అది నా చేతిస్పర్శతోనే గ్రహించాను సుమా!

చెవిలోంచి రక్తం రాకుండా వేలు అడ్డుపెట్టాను. హమ్మయ్య... నా కర్ణభేరి పగిలిపోయింది. ఇంక ఆ

అశోక్.వికె

మహమ్మారి శబ్దం నా చెవి జోలికి రాదులే.

ఆ... ఏమిటి శబ్దం. మళ్లీ వస్తుంది. శబ్దం, పెద్ద శబ్దం... అబ్బా అదే శబ్దం... ఎలా...?

ఆ... అర్థమైంది... రెండో చెవిలో సూది గుచ్చలేదుకదూ?! ఆ చెవికే వినిపిస్తోంది ఈ బ్లడీ శబ్దం.

గుండుసూది ఏది?

ఓహో!

రెండు రోజులక్రితం ఆకలైతే జేబు తడుముకుని చూశాను (ఎంత ఉందో ఖచ్చితంగా తెలుసు) ఓ ఇరవై పైసల నాణెం, ఓ పది పైసల నాణెం. వెరసి ముప్పయి పైసలు. భోజనానికి కాదు గదా కనీసం బన్ కి కూడా చాలవ్.

ఓ ఐడియా వచ్చింది. భోజనం చేసిన అనుభూతి పొందాలంటే పాన్ వేసుకుంటే సరిపోతుంది.

జరదాపాన్ ఎంతని అడిగాను.

'అరవై పైసల్'

'వద్దులే సాదాపాన్ కట్టు'

పాన్ వేసుకున్నా 'డాన్'లో అమితాబ్ లా. చేతిలో ఉన్న మొత్తం యావదాస్తి ముప్పయి పైసలు, ఎటువంటి రిజిస్ట్రేషన్ ఖర్చులు లేకుండానే పాన్ డబ్బావాడి చేతిలో పెట్టా. స్మగ్లర్స్ డైమెండ్స్ని టెస్ట్ చేసినట్లు ఆ ముప్పయి పైసల్ని పరిశీలించి ''చార్ దస్ పైసే దేవ్'' అన్నాడు.

నేను గతుక్కుమన్నాను.

మరుక్షణంలో నా గల్లా అంటే కాలర్ పట్టుకుని నానా బూతులు తిట్టి 'జావ్ రే సాలే జావ్' అన్నాడు.

బ్రతికి బయట పడ్డాననిపించింది.

ఆ హడావిడిలోనే నా చొక్కా గుండీ ఊడిపోయింది.

అసలు ఈ కథంతా ఎందుకనా?

ఎందుకంటే ఇప్పుడు నాకు కావలసిన నేస్తం గుండుసూది.

ఆ రోజు తిన్న పాన్ తాలూకు వక్కపలుకు పళ్లలో ఇరుక్కుంటే (అప్పట్నుంచి ఏమీ తినవందున అది అలాగే వుండిపోయింది) పెకిలిస్తుంది నా ఎడమ చేయి, మన నేస్తం గుండుసూది సాయంతో.

చచ్చి (బ్రతికిలేను కదా) బాగుంటే పళ్లు తరువాత కుట్టుకోవచ్చు...

ఈ ఘోరమైన శబ్దాన్ని బంధించాలంటే రెండో చెవిని కూడా గుచ్చాలి.

గుండుసూది తీసుకున్నా మళ్లీ కళ్లు గట్టిగా మూసుకున్నా... (ఇంతవరకూ కళ్లు తెరిచే వున్నాను) మళ్లీ నోరు నాకు తెలియకుండానే తెరుచుకుంది.

గట్టిగా బలమంతా ఉపయోగించి చెవిలోపలకి గుండుసూదితో పొడిచాను.

అమ్మా... అబ్బా... అయ్యో...

మళ్లీ రక్తం.

''మూడు నెలల పసికందు పాలకోసం తపించి ఏడ్చి, ఏడ్చి కంటిలోని నీరంతా ఇంకిపోతే, 'సిర'ల్లోని రక్తమే కంటినుండి ధారగా కారుతున్నట్లు...''

నా చెయ్యి కూడా రక్తంతో తడిసింది.

రక్తం రాకుండా చెవిలో వేలు అడ్డుపెట్టాను.

ఆహా... ఇంకేమీ బాధలేదు.

ఒక చిన్న 'గుండుసూది'తోనే నా సమస్య పరిష్కారమైంది.



గుండుసూది చాలా శక్తిమంతమైంది.

గుండుసూదికి ఇంతశక్తి ఉందని తెలిస్తే, గ్రామానికో తుపాకీబదులు, గ్రామానికో గుండుసూది ఇచ్చి ఉండేవారు మన మాజీ అన్నగారు.

ఆ... మళ్లీ వస్తుంది శబ్దం. అదేశబ్దం... ఇంకా బిగ్గరగా, భయంగా వినిపిస్తోంది. రెండు చెవులకు కర్ణభేరి పగిలిపోయి రక్తం ధారలుగా కారుతున్నా, ఇంకా శబ్దం వినిపిస్తోనే ఉంది.

ఏం చేయాలో అంతుబట్టలేదు. స్థిరంగా కళ్లు మూసుకొని (కళ్లు మూసుకునే ఉన్నాను) నిశ్చలంగా ఆలోచించాను మౌనిలా...

నా హృది కవాటాలు తెరచుకుని ఆ భీకరశబ్దాల్ని వడపోసి, పరీక్షించి, అది పగిలే అగ్నిపర్వతాల శబ్దాలు కావు...

ఏడుపులు, నిట్టూర్పులు అవి ఓ స్టేట్ మెంట్ తయారుచేశాయి.

మనోవిజ్ఞతతో పరిశీలించాను. నిజమే అవి నిట్టూర్పులు, ఏడుపులు, బాగా పరిచయమున్న గొంతులే!

బాగా పరిచయమున్న గొంతులు. ఎవరివి? ఎవరవ్వచ్చు? ఎవరివని ఎవ్వరివో కళ్లు తెరిచి చూస్తే తెలుస్తుంది. కాని కళ్లు తెరవలేను. మరి ఎలా చూసేది... ఎవరి గొంతులో ఎలా తెలుస్తుంది. తప్పదు... కళ్లు తెరవాలి. తెరిచి చూడాలి. కళ్లు తెరవడానికి సంసిద్ధుడ్నయ్యాను.

గుడ్డివాడికి కంటి ఆపరేషన్ చేసిన తరువాత, డాక్టరు కట్లు విప్పినపుడు మెల్లిగా కళ్లు తెరిచినట్టు... కళ్లు తెరిచాను... ఏమీ కనిపించడం లేదు. చెవిలో వున్న చేతులను తీసి కళ్లను నులిమాను. మసగ్గా కనబడుతోంది. చిత్రకారుడు గీసిన అసంపూర్ణ చిత్రంపై కర్టెన్ వేసినట్లు...

మళ్లా కళ్లు గట్టిగా నులిమాను.

కళ్లు తెరచి చూశాను! కళ్లముందు దృశ్యాలు.

సినిమా రీళ్లలాగా కదలాడుతున్నాయి. చాలా స్పష్టంగా కన్పిస్తున్నాయి. బొట్టులేని ఫాలభాగంతో బోసిపోయిన మోముతో నా భార్య.

బోసి నవ్వులు మాసిపోయిన నా బంగారుపాప, దీనంగా అతిహీనంగా వంటి మీద సరైన బట్టకి కరువై, ఎండిన డొక్కల్తో, ఆకాశపు అంచుల్ని చూస్తూ... ''కూడు లేక, గూడు లేక ఆఖరికి నా నీడైనా లేని ఈ జీవితం వ్యర్థమని మూగగా రోదిస్తూ నన్ను నీలో చేర్చుకోమంటూ'' అనంత విశ్వంలోకి పక్షిలా చేతులు చాచి ఎగరాలని ప్రయత్నిస్తున్న నా భార్య, తన కాళ్లను చుట్టుకుని ''ఈభూమిమీద దిక్కులేని అనాథగా కుక్కకన్నా హీనమైన జీవితాన్ని గడపాలా అని తన చూపులతోనే ప్రశ్నిస్తూ నా బిడ్డ.

నా కళ్లు చెమ్మగిల్లాయి. బొట్లుబొట్లుగా నా కంటి నుండి ధారగా కన్నీరు. కళ్లు నులుముకున్నాను.

కళ్ల ముందు దృశ్యం మాయమైంది.

☆ ☆ ☆

చచ్చిపోబోతున్న మా తాత తన ఆత్మశాంతి కోసం ఉద్యోగంలేని నా ముఖానికి పెళ్లిచేయించి మరీ చచ్చిపోయాడు. పెళ్లి చేసుకున్న పాపానికి ఫలంగా ఓ పాప.

కానీ ఉద్యోగం మాత్రం శూన్యం. బ్యాంక్ టెస్ట్లు, పి.వోలు, గ్రూప్ వన్, టూ, త్రీలు ఎన్నో, ఎన్నెన్నో ఉద్యోగాలకు అప్లయి చేసి అవి సాధించే సత్తా (డబ్బు) లేక ఘోర పరాజయం పొంది, జీవితాన్ని చాలించాలన్నది నా మనస్సంకల్పం.

స్వప్నావస్థను ఛేదించుకుని వాస్తవంలోకి ఊడిపడ్డాను.

అసమర్థుడైన భర్తగా, తండ్రిగా ఉన్నందుకు సిగ్గేసింది. ఛా... అసమర్థుడ్ని కాను నేను అసమర్థుడ్ని కాను.

నా భార్య నుదుటిన ఎర్రటి తిలకం దిద్ది నా మూడ్నెల్ల పాపకు పాలు పట్టాలి.

గజిబిజిగా పిచ్చి పిచ్చి ఆలోచనల్తోవున్న నా మనఃఫలకం మీద తెల్లని రంగుపూసి కేంద్రబిందువును సూచించాను. ఆ బిందువే మా వీధి చివరనఉన్న రిక్షాలు తయారుచేసే కార్ఖానాలో నన్ను పెయింటర్ గా చేర్చింది. ఆ రోజు సంపాదన ఏడు రూపాయలు. ఆకాశంలోకి రెక్కలు లేకుండానే ఎగిరిన ఆనందం. నా భార్యకు ఓ మూరెడు మల్లెలు, నా పాపకు ఓ అరలీటరు పాల పాకెట్.

జీవితాన్ని సాధించాను. నేను మనిషినే... ఇప్పుడు నేను మనీషిని.

అనంతశిఖరాల్ని అధిరోహించాలన్న ప్రారంభం ఒక్క అడుగుతోనే.